క్లుప్తంగా

నేడు ప్లాట్ల కేటాయింపు

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారం, అన్నోజిగూడ గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇంటి స్థలాల సర్టిఫికెట్లు అందించడానికి శనివారం మంత్రి సబితారెడ్డి రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఐఐసీ అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌లో ప్లాట్లు కేటాయించనున్నారన్నారు. మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి నాయకులు, లబ్ధిదారులందరూ సకాలంలో హాజరవ్వాలని ఆయన కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న టీకేఆర్, అనితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని గూడూరులోని శ్రీలక్ష్మీగోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరిని సర్పంచ్ శ్రీలత, ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

మండలాభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ జంగారెడ్డి



నిధుల మంజూరు పత్రం అందిస్తున్న జంగారెడ్డి

కందుకూరు: మండలాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సీసీ రోడ్లకు రూ.15 లక్షలు, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.10 లక్షల జెడ్పీ నిధులు కేటాయిస్తూ శుక్రవారం ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డికి మంజూరు పత్రాన్ని ఆయన అందజేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, ప్రశాంత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పాలంకరణ నిర్వహించారు. శివుడికి పూలాఅభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్, డైరెక్టర్లు, పూజారులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న శివకుమార్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు కౌన్సిలర్ వై.శివకుమార్ అన్నప్రాసన చేయించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక వసుతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం తగదు: బీజేపీ

హయత్‌నగర్: మన ఊరు– మన బడి అంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం సర్కార్ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదులు నిర్మించేందుకు శిలాఫలకం వేసి నాలుగేళ్లైనా నిర్మాణం చేపట్టలేదని శుక్రవారం బీజేపీ నాయకులు శిలాఫలకానికి పాలాభిషేకం చేశారు. తరగతి గదులు లేక విద్యార్థులు చెట్ల కింద కూర్చుంటూ చదువుకుంటున్నారని, అదనపు గదులు నిర్మిస్తామని నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడ సిగ్గుచేటన్నారు. గతంలో చేపట్టిన పనులకు దిక్కులేదుగానీ ..మన ఊరు మన బడి అంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. శంకుస్థాపన చేసిన గదుల నిర్మాణం వెంటనే చేపట్టకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, నాయకులు భాస్కర్, గోవిందాచారి, గంగని శ్రీను, సంఘి అశోక్ పాల్గొన్నారు.



పెద్ద చెరువు కట్టపై చెత్త డంపింగ్



చెరువు కట్ట వద్ద నిలిచిన అభివృద్ధి పనులు

చెరువు సుందరీ'కరుణ' లేదు

- ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభం
- నేటికీ పూర్తికాని వైనం
- ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మీర్‌పేట: పనులు ప్రారంభించి ఏడాదిన్నర కావస్తున్నా చెరువు కట్ట విస్తరణ, సుందరీకరణ పనులు పూర్తి కావడం లేదు. దీంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు సుందరీకరణ పనులకు గాను ప్రభుత్వం రూ. 7 కోట్లు మంజూరు చేసింది. 2021 ఆగస్టు, 11న మంత్రి సబితారెడ్డి ఇందుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సుందరీకరణలో భాగంగా హెచ్ఎండీఏ అధికారులు ముందుగా చెరువు కట్టను పటిష్టపరచడంతో పాటు రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. పనులు మొదలై దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాలేదు. పది రోజులు పనులు సాగితే నెల రోజులు పాటు ఆగిపోతున్నాయని ప్రజలు, వాహనచోదకులు అంటున్నారు.

రహదారి మూసివేతతో అవస్థలు

చెరువు కట్ట విస్తరణ పేరుతో హెచ్ఎండీఏ అధికారులు రహదారిని మూసివేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మీర్‌పేట నుంచి బాలాపూర్ చౌరస్తాకు రాకపోకలు సాగించాలంటే చెరువు కట్ట ప్రధాన రహదారి. పనుల పేరుతో నెలల పాటు కట్టను మూసివేయడంతో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు తెలిపారు. అదే విధంగా రహదారిని మూసివేయడంతో కుళ్లిన వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని డంప్ చేస్తుండడంతో రోడ్డు, చెరువు పరిసరాలు డంపింగ్ యార్డుగా దర్శనమిస్తున్నాయని పలువురు తెలిపారు. కొన్ని రోజులుగా కార్పొరేషన్ సిబ్బంది ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను కట్ట వద్దే డంప్ చేస్తుండడంతో దుర్వాసన వస్తోంది. ప్రజలు, వాహనచోదకులు ఎదుర్కొంటున్న అవస్థలను దృష్టిలో పెట్టుకుని హెచ్ఎండీఏ అధికారులు త్వరితగతిన చెరువు కట్ట విస్తరణ, సుందరీకరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్
- తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన

హుడాకాంప్లెక్స్: ఇళ్లులేని నిరుపనేదలకు వెంటనే డబుల్ ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య అధ్యక్షతన సరూర్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చెన్నారం మల్లేష్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కార్మికవర్గం బతుకుదెరువు కోసం హైదరాబాద్ మహానగరానికి వచ్చి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. నిలువ నీడ లేక వాళ్ల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని గొప్పలు చెప్పుకుంటూ ఓట్లు వేయించుకుంటున్నాయని, అధికారంలోకి రాగానే హామీలు గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. నగరంలో సుమారు 10 లక్షల కుటుంబాలు అద్దె ఇళ్లలో ఉంటున్నాయని.. పేదలందరికీ డబుల్ ఇళ్లు కేటాయించాలని అన్నారు. లేనిపక్షంలో పేదలతో కలిసి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేస్తామని అన్నారు. ఈనెల 9న.. ఇళ్లస్థలాలు, డబుల్ ఇళ్లకోసం ఇందిరా పార్కు దగ్గర పెద్దఎత్తున ధర్నా చేపడుతున్నామని అన్నారు. ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఎల్లయ్య,మత్స్య కార్మిక సంఘంజిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్.వెంకన్న, నాయకులు శ్రీనివాస్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గోపీనాయక్, మల్లేశ్, మేకల కృష్ణ, దుర్గారావు, కడారి రాములు, చైతన్య పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించండి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్

కందుకూరు: స్థలం ఉన్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్, మండల కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లులేని ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ కట్టిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో ఆ పథకం అమలుకు నోచుకోలేకపోవడం బాధాకరమన్నారు. దీంతో నిరుపేదలు ఇళ్లులేక అవస్థలు పడుతున్నారన్నారు. సీపీఎం నాయకులు బాల్‌రాజు, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షుడు రాయకంటి శేఖర్, జీఎంపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం, నాయకులు కుమార్, అంజయ్య, యాద య్య, అరుణ, యాదమ్మ, అనిత పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పేదలకు చేయూతనివ్వడం అభినందనీయం

డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

మీర్‌పేట: పేదలకు ఆయుష్మాన్ గ్రూప్ ఆఫ్ చారిటీ వారు చేయూతనివ్వడం అభినందనీయమని మీర్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అన్నారు. 35వ డివిజన్‌లో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ జిల్లా సౌందర్య ఆధ్వర్యంలో ఆయుష్మాన్ చారిటీ సహకారంతో పేద వృద్ధ, వితంతు, వికలాంగులకు ప్రతి నెలా రూ.1500 పెన్షన్‌తో పాటు నిత్యావసర పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విక్రంరెడ్డి మాట్లాడుతూ.. ప్రతినెలా అందించే పెన్షన్, నిత్యావసరాలు ఎంతో ఉపయోగపడతాయని, పేద ప్రజలకు మేలు చేసే సంస్థలకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు రజాక్, కార్పొరేటర్లు గజ్జెల రాంచందర్, ఇంద్రావత్ రవినాయక్, నాయకులు ఎం.దీప్‌లాల్ చౌహాన్, ఆయుష్మాన్ గ్రూప్ ఆఫ్ చారిటీ సభ్యులు శ్రీదేవి, ప్రమీల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



పేదలకు పెన్షన్ డబ్బు అందజేస్తున్న విక్రంరెడ్డి, తదితరులు

డీఆర్‌సీ కేంద్రాన్ని తరలించండి: బీజేపీ



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వామికుమార్ తదితరులు

మీర్‌పేట: పేద ప్రజలు శుభకార్యాలు చేసుకునే హుడా కమ్యూనిటీహాల్‌లో డ్రై రిసోర్స్ సెంటర్ (డీఆర్‌సీ) ఏర్పాటు చేయడం సరైంది కాదని, మరోచోటకు మార్చాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ ఉపాధ్యక్షుడు ఒర్సు స్వామికుమార్ శుక్రవారం కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామికుమార్ మాట్లాడుతూ... లెనిన్‌నగర్ ప్రాంతంలోని పేద ప్రజలు చిన్నచిన్న శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా 40 ఏళ్ల క్రితం హుడాకాలనీలో హుడా కమ్యూనిటీహాల్‌ను నిర్మించడం జరిగిందన్నారు. ఇటీవల కమ్యూనిటీహాల్‌లో డీఆర్‌సీ ఏర్పాటు చేయడంతో పాడిచెత్త డంపింగ్ కేంద్రంగా మారిపోయిందని అన్నారు. స్థానిక పేద ప్రజల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్ వారికే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తేగా, త్వరలోనే డీఆర్‌సీ కేంద్రాన్ని మరో చోటకు మారుస్తామని తెలిపినట్లు స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెవ్వ శ్రావణ్‌కుమార్, శ్రీను, మహేష్‌కుమార్, శ్రవణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగిస్తున్నందున శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గణేష్‌పురి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 11కేవీ చైతన్యపురి ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అది ప్రభుత్వ భూమి కాదు!

సింగిల్ విండో సొసైటీ డైరెక్టర్ కొండల్‌రెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ ఎర్రకుంట చెరువు స్థలం కబ్జాకు అధికార పార్టీకి చెందిన నేతలు యత్నిస్తున్నారని బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని సింగిల్ విండో సొసైటీ డైరెక్టర్ చప్పిడి కొండల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన బడంగ్‌పేటలో మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబరు 86లో కొంతభాగం అనాదిగా తమ ఆధీనంలోనే ఉందని.. తాము పశువుల షెడ్డు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామని స్పష్టం చేశారు. తమ భూమికి ఆనుకొని ఇదే సర్వే నంబరులో ఉన్న భూమిలో గతంలో కొందరు అక్రమార్కులు ఇళ్లను నిర్మించి లక్షల రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకున్నా ఎవరూ స్పందించలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఈ సర్వే నంబరులోని మొత్తం భూమిని రెవెన్యూ శాఖ సర్వేచేసి అన్యాక్రాంతమైన మొత్తం భూమి ఎంతో తేల్చాలని కోరారు. అక్రమార్కులెవరో నిగ్గు తేల్చాలని స్పష్టంచేశారు. బీజేపీ నేతలు రాజకీయంగా తమను ఎదుర్కొలేక బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం

కందుకూరు: మండలంలోని ఆకులమైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం స్కూల్‌లో కలిశారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండీ మునావర్, బి.రమేష్, కె.సత్యం, ఎ.రమేష్, రాజేందర్, శ్రీను, నర్సింహ, అశోక్, సత్యం, అపర్ణ, మాధవి, జ్యోతి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.



నగదు బదిలీ చేయండి

తహసీల్దార్లకు గొర్రెల కాపరుల సంఘం నేతల వినతి

కందుకూరు: రెండో విడత గొర్రెల పంపిణీకి బదులు నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల అధ్యక్షుడు ఎ.పాలేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌర శ్రీశైలం మాట్లాడారు. నగదు బదిలీతో పాటు గొర్రెల షెడ్ నిర్మించుకునేందుకు ఇచ్చే రూ.30లక్షల్లో సగం రాయితీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఆ దిశగా సమీక్ష నిర్వహించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చెంచు అంజయ్య, సీఎం రాజు, బాలకృష్ణ, నాగేశ్, కృష్ణ, శేఖర్, అంజయ్య పాల్గొన్నారు.

హామీ నిలబెట్టుకోవాలి..

కడ్తాల్: గొర్రెల కాపరులకు గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా నగదు బదిలీ చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు క్యామ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గౌరెటి యాదయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కడ్తాల్ తహసీల్దార్ మురళీకృష్ణకు గొర్రెలకాపరుల సహకార సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మొదటి విడుత గొర్రెల పంపిణీలో దళారుల వల్ల పెంపకందారులు తీవ్రంగా నష్టపోయారని... రెండవ విడుత గొర్రెల పంపిణీలో గొర్రెల పంపిణీకి బదులుగా నగదు బదిలీ అమలు చేయాలని కోరారు. మునుగోడు అసెంబ్లీ ఉపఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. గొర్రెలకు బదులు, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు బదిలీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి నెలలు గడిచినా హామీని నిలబెట్టుకోలేదని, లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గొర్రెల పెంపకానికి ఫారెస్ట్ డివిజన్‌లో కొంత మొత్తం భూమిని కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి అంజయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఉప సర్పంచ్ రామకృష్ణ, బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, డైరెక్టర్‌లు రాంచంద్రయ్య, మహేశ్, రమేశ్, రాజేశ్, యాదయ్య, రమేశ్, లక్ష్మీనారాయణ, శివ, శ్రీశైలం ఉన్నారు.

వినతిపత్రం అందజేత..

తలకొండపల్లి: మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు గొర్లకు బదులుగా నగదు అందజేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షుడు చిన్న మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం కమిటీ సభ్యులతో కలిసి తహసీల్దార్‌కు కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కోశాధికారి తిరుపతి, మహేందర్, కృష్ణయ్య, జీఎంపీఎస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గొర్రెల కాపరుల సంఘం నేతలు

కొనసాగుతున్న కంటివెలుగు

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ అనురాధ అన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ అంబర్‌సింగ్‌తో కలిసి వారు ప్రారంభించారు. 179 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారన్నారు. శుక్లాలుంటే కంటి ఆపరేషన్లు కూడా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఇందిర, డాక్టర్లు పరీక్షిత్ నరేందర్, మంజులాదేవి, తిరుపతిరెడ్డి, స్థానిక నాయకులు మల్లేశ్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు అండగా ఉంటా

ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో పనిచేసే అర్చకులకు ప్రతి సంవత్సరం రూ.60 వేలు తాను వ్యక్తిగతంగా అందించడం జరుగుతుందని ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాదికి సంబంధించిన రూ.60 వేలను ఆలయ అర్చకులకు శుక్రవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలో పనిచేసే అర్చకులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన జీవితాంతం ప్రతి సంవత్సరం రూ.60 వేలు ఆలయ అర్చకులకు అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అలయ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, స్థానిక నాయకులు చెన్నకిషన్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, బీచ్యానాయక్, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



అర్చకులకు విరాళం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా


హస్తినాపురం: డివిజన్ పరిధిలోని కాలనీ అంతర్గత రోడ్లతో పాటు, బహిరంగ ప్రదేశాల్లో, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెత్తా చెదారాన్ని వేస్తే సహించేది లేదని, అలాంటి వారిని గుర్తించి జరిమానాలు విధిస్తామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో శుక్రవారం ఆమె కాలనీ వాసులతో కలిసి మార్నింగ్ వాక్ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతా నాయక్ మాట్లాడుతూ, ఖాళీ ప్లాట్లలో చెత్తవేయడం వల్ల దుర్వాసన రావడంతో పాటు చెత్తలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, కాలనీ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, గంధం శ్రీనివాస్, కృష్ణగౌడ్, ప్రేమ్‌రాజ్ బాలునాయక్, చంద్రశేఖర్, సుదర్శన చారి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల కిలో రూపాయల్లో.. టమాటా (లోకల్) రూ.13, (618 రకం) రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.45, కాలీఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.09, కారెట్ రూ.19. దొండ రూ.32, ఆలుగడ్డ రూ. 21, ఉల్లి రూ.18, గోకర రూ.37, దోస రూ.23, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.13, అరటి కాయ రూ.09, చిక్కుడు రూ.50, అర్వి రూ.68, మునగ రూ.75, చిలుకడ దుంప రూ.28, బీట్‌రూట్ రూ.15, కీర రూ.23, బీన్స్ రూ.35, క్యాప్సికమ్ రూ.50. గమనిక: ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదే

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మంచాల: తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదేనని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని జాపాల గ్రామానికి చెందిన పలువురు మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిందన్నారు. గ్రామాల్లో పేదలకు ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, దళితులకు మూడెకరాలు భూమి ఇవ్వలేదన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో ఆగాపల్లి, జాపాలకు చెందిన కల్పన, కళమ్మ, గీత, కోటమ్మ, స్వరూప, ప్రీతి, మనీలా, సువర్ణ, బకున వీర మల్లప్ప, మల్లేశ్, మహేష్, భిక్షపతి, నరేష్, జంగయ్య, స్వామి, లింగం, కృష్ణ, సత్యం, సిద్ధు, శంకర్ ఉన్నారు. జిల్లా నాయకుడు సంజీవ, మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

6నుంచి ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థుల కోసం ఈనెల 6వ తేదీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు ఎంకేఆర్ ఫౌండేషన్ కార్యదర్శి జెర్కొని రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగాలు, గ్రూప్–1, గ్రూప్–4 తోపాటు ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం రెండవ దఫా శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇప్పటికే అధ్యాపకులతో మాట్లాడినట్లు చెప్పారు. అభ్యర్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన అన్నివర్గాల అభ్యర్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. 45 రోజుల పాటు తరగతులు నిర్వహించి 10 గ్రాండ్ టెస్టులతో అభ్యర్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.